ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY

సంగారెడ్డి

శనివారం 22 డిసెంబరు 2018 | 16 పేజీలు



# కడుపు కోతలకు కళ్లెం!

**సహజ కాన్పులపై ప్రత్యేకంగా దృష్టి ● కరీంనగర్ జిల్లా నుంచి వచ్చిన నిపుణులు ● ఆరు నెలలపాటు సంగారెడ్డి సిబ్బందికి శిక్షణ**

ఏప్రిల్ నుంచి నవంబర్ 30 వరకు
సంగారెడ్డి జిల్లాలో ప్రసవాల తీరుతెన్నులు

| ● ఇంటి వద్ద 65 మంది ప్రసవాలు | ● వాటి శాతం 0.3 |
|---|---|

అర్ధగోల కడుపు కోతలకు ఇక కళ్లెం పడనుంది. ప్రసవ సమయంలో చేస్తున్న శస్త్ర చికిత్సలతో మాతృమూర్తులకు పుట్టెడు కష్టాలు చుట్టుముడుతున్నాయి. తొలి కాన్పునకు శస్త్ర చికిత్స చేసుకుంటే ఇక ప్రతిసారి కోత తప్పదు. ఇలాంటి సమస్యల నుంచి గట్టెక్కించేందుకు రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈమేరకు కరీంనగర్, సంగారెడ్డి జిల్లాలను నమూనాగా ఎంచుకున్నారు. ఆసుపత్రుల్లో సహజ కాన్పులు చేయడంపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. తొలుత ఏడాదిపాటు థియరీ పరీక్షలు కరీంనగర్ జిల్లాలో ఇచ్చారు. సంగారెడ్డిలో ఆరు నెలలపాటు మిడ్‌వైఫరీ (ప్రసూతి వైద్య శిక్షణ) ఇవ్వాలని నిర్ణయించారు. ఈమేరకు కరీంనగర్ జిల్లా నుంచి ఇద్దరు వైద్య నిపుణులతోపాటు 30 మంది శిక్షణ తీసుకున్న సిబ్బంది ఇక్కడికి వచ్చారు. ఈనెల 17 నుంచి శిక్షణ మొదలైంది. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం...

| | సాధారణ కాన్పులు | శాతం | శస్త్ర చికిత్సలు | శాతం |
|---|---|---|---|---|
| ప్రభుత్వ ఆసుపత్రుల్లో | 7,886 | 70% | 3,373 | 30% |
| ప్రైవేట్ ఆసుపత్రుల్లో | 1,130 | 29% | 2,796 | 65% |

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల పరిధిలో సంగారెడ్డిలోని జిల్లా కేంద్ర ఆసుపత్రి, పటాన్‌చెరు, నారాయణఖేడ్, జోగిపేట, జహీరాబాద్ ప్రాంతీయ ఆసుపత్రులు ఉన్నాయి. జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలో 29 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ) ఉన్నాయి. వీటిలోని 17 పీహెచ్‌సీల్లో 24 గంటలపాటు సేవలు అందిస్తున్నారు. ఇక 12 గంటలు పని చేసే పీహెచ్‌సీలు 12 ఉన్నాయి. వీటితోపాటు సదాశివపేటలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలోనూ ప్రసవాలు చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాకు తలమానికమైన జిల్లా కేంద్ర ఆసుపత్రికి ఉమ్మడి మెదక్ జిల్లావాసులే కాకుండా సమీపంలోని వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన వారు వైద్యం కోసం వస్తుంటారు. జిల్లాలోని ప్రాంతీయ, సామాజిక ఆరోగ్య ఆసుపత్రుల నుంచి సైతం రోగులను, గర్భిణులను ఇక్కడికి పంపిస్తుంటారు. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సాధారణ కాన్పుల శాతం గణనీయంగా పెరిగింది. మరింత మెరుగైన ఫలితాల కోసం హైదరాబాద్‌లో సాధారణ ప్రసవాలకు పేరెన్నికగన్న ఫెర్నాండేజ్ ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులతో ఇక్కడి సిబ్బందికి శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారు.

## ఆరు నెలలపాటు తర్ఫీదు

ఫెర్నాండేజ్ ఆసుపత్రికి చెందిన ఇద్దరు నిపుణులతోపాటు 30 మంది మహిళా శిక్షకులు సంగారెడ్డికి వచ్చారు. సంబంధిత విభాగాల్లో వీరంతా ...మిగతా 7లో



స్థానిక వైద్యారోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఫెర్నాండేజ్ ఆసుపత్రికి చెందిన శిక్షకులు

## జిల్లాకు శిక్షకులు రావడం వరం

–శ్రీ.సంగారెడ్డి, జిల్లా కేంద్ర ఆసుపత్రి ఇన్‌చార్జి పర్యవేక్షకులు



ఇప్పటికే జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాటిని మరింత పెంచేలా ఫెర్నాండేజ్ ఆసుపత్రికి చెందిన వైద్యులు, వారి సిబ్బంది 30 మంది ఇక్కడికి వచ్చి శిక్షణ ఇవ్వడం మాకు వరం లాంటిది. ఈ నిర్ణయంతో జిల్లాకు మంచి అవకాశం దక్కింది. గర్భిణులకు కడుపు కోతలు లేకుండా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. ప్రైవేటుకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు చేసుకుంటే తల్లీబిడ్డలకు క్షేమదాయకంగా ఉంటుంది.

(మొదటి పేజీ తరువాయి) సంవత్సరాల అనుభవం గడించిన వారు కావడం గమనార్హం. సంగారెడ్డిలోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలో పని చేస్తున్న 24 మంది రెగ్యులర్, ఆరుగురు ఒప్పంద స్టాఫ్ నర్సులకు శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ ఇప్పటి వరకు సంప్రదాయ విధానాలతో మూస పద్ధతిలో సాధారణ కాన్పులు చేస్తున్నారు. చిన్నచిన్న సమస్యలు ఎదురైనా వెంటనే హైదరాబాద్‌కు పంపిస్తుంటారు. దాంతో గర్భిణికి, ఆమె కుటుంబ సభ్యులకు తీవ్ర ఆందోళనలు తప్పడంలేదు. ఈ సమస్యలను తీర్చడానికి కాన్పులు చేసే వైద్య సిబ్బందికి మెలకువలు నేర్పిస్తున్నారు. హైరిస్క్ గర్భిణికి సైతం సాధారణ కాన్పునకు ప్రయత్నాలు చేసేలా, రక్తస్రావం కలిగే సమయంలో తల్లీబిడ్డలను ప్రాణాపాయం నుంచి తప్పించేలా చర్యలు తీసుకుంటారు. అన్ని అంశాలపై ప్రతిరోజూ ప్రత్యక్ష ఉదాహరణలతో శిక్షణ ఇస్తున్నారు.

## ప్రైవేట్‌లో ఇష్టానుసారంగా శస్త్రచికిత్సలు

జిల్లాలో 92 ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. వాటిలో ఇష్టానుసారంగా కడుపు కోతలకు పాల్పడుతున్నట్లు వైద్యారోగ్యశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రసవాలకు వెళ్లిన వారిని భయకంపితులను చేస్తూ కాసుల కక్కుర్తితో అనవసర ఆపరేషనకు దిగుతున్నారు. వీటిల్లో సాధారణ కాన్పులు 29 శాతం ఉండగా 71 శాతం శస్త్రచికిత్సలు చేస్తుండటం గమనార్హం. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం సుఖ ప్రసవాలకు ప్రాధాన్యం ఇస్తుండగా ప్రైవేటులో మాత్రం ఇలా అశ్రద్ధ వహిస్తుండటం విస్మయానికి గురిచేస్తోంది. ఈ తంతు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మహిళల ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడే అవకాశముంది.



సంగారెడ్డిలోని మాతా శిశుసంరక్షణ కేంద్రం